సాక్షి తిరుపతి

సోమవారం। 15। జూలై। 2024



విద్యార్థిని మృతిపై రాస్తారోకో

డక్కిలి అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఐదో తరగతి విద్యార్థిని మృతిపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. - 8లో



అత్యాచారాలను అరికట్టాలి

రాష్ట్రంలో చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోవడం సిగ్గుచేటని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.. - 8లో



సిరులు కురిపిస్తున్న నిమ్మ

నిమ్మ సాగు రైతుకు సిరులు కురిపిస్తోంది. గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. - 8లో

న్యూస్‌రీల్

19న జాబ్‌మేళా

నాయుడుపేటటౌన్: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 19వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మధుసూదనవర్మ ఆదివారం తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు ఈ మేళాలో ఇంటర్వ్యూలు చేయనున్నట్లు చెప్పారు. డిగ్రీ, బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ, బీబీసీ, పాస్ అవుట్ విద్యార్థులు, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారు ఆంధ్ర, తెలంగాణలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి రూ. 2.6 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం ఉంటుందని, మేళాకు ఏ కళాశాల విద్యార్థులైనా హాజరు కావచ్చన్నారు. హాజరయ్యే వారు బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, ఫొటోలు, సర్టిఫికెట్లు, మార్కుల లిస్టు.. మొదలైన వాటిని తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 73865 55444, 93468 26492 నంబర్లుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు 55శాతం హాజరు

– కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ పరీక్షలకు 55శాతం మంది హాజరయ్యారని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, తిరుపతిలోని మూడు కేంద్రాల్లో ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షలకు ఉదయం పేపర్–1కు 55.71 శాతం, మధ్యాహ్నం పేపర్–2కు 55.80 శాతం మంది హాజరయ్యాయని వెల్లడించారు. ఈ రెండు రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. 1,199 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం పేపర్–1కు 668 మంది, మధ్యాహ్నం పేపర్–2కు 669 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలియజేశారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అర్జీల రూపంలో సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం




విరాళాలను ఆలయ ఈఓకు అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు తమవంతు విరాళాలు అందజేశారు. ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా అవసరమైన ద్వారాల ఏర్పాటుకు తమిళనాడులోని సేలంకు చెందిన వీఆర్‌కే గోపీనాథన్ రూ.4.10లక్షలు, చంద్రగిరి మండలం అగరాలకు చెందిన పాలపాటి చైతన్య రెడ్డి రూ.1.01లక్షలు, తిరుపతి రూరల్ మండలం కాలూరు గ్రామానికి చెందిన సరళ రూ.10వేల చొప్పున విరాళాన్ని ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డికి ఆదివారం అందజేశారు. ఆలయ ఈఓ వారికి అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దాతల విరాళాలతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ లాగిన్‌లలో టెన్త్ రీ–కౌంటింగ్ ఫలితాలు

చిత్తూరు కలెక్టరేట్ : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల మార్కుల రీ–కౌంటింగ్, రీ వెరిఫికేషన్ ఫలితాలు ఆయా స్కూల్ లాగిన్లలో నమోదు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాలపై సందేహంతో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఫలితాలు విడుదల చేశారని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళ్లి లాగిన్‌లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను చూసుకోవాలని డీఈఓ తెలియజేశారు.

బాబూ.. ఇదేం పరీక్ష!



నామినేటెడ్ పోస్టుల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న కొత్త పంథా చూసి పార్టీ క్యాడర్ గగ్గోలు పెడుతోంది. పార్టీ అధికారంలోకి వస్తే కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపునిస్తామన్న బాబు తీరా 'కూటమి'గా జతకట్టి అధికారంలోకి రావడంతో ఆశావహుల విషయంలో పాము చావకుండా..కర్రా విరగకుండా అనే లెవెల్లో వారికి అగ్నిపరీక్ష పెట్టారు. తాను నిర్వహించే సర్వేలో ఎవరికి జనాదరణ ఉందో వారికే నామినేటెడ్ పదవులంటూ ఝలక్ ఇచ్చారు. పదవుల కోసం కూటమి నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న తరుణంలో సర్వే చర్చనీయాంశమైంది. బహిరంగంగానే టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల కోసం బాబు సర్వే

- ఐవీఆర్‌ఎస్ సర్వేపై బెంబేలెత్తుతున్న టీడీపీ క్యా'డర్'
- సర్వేలో నెగ్గితే తప్ప పదవుల్లేవు
- నెలరోజులుగా ఎమ్మెల్యేలతో అంటకాగిన ఆశావహులు
- కొత్త మెలికతో కళ్లు బైర్లు
- జనసేన, బీజేపీ నాయకులతో పోటీ
- ఐదేళ్లు పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు లేదా? అని నిట్టూర్పు
- నేతల్లో రాజుకుంటున్న అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తాయని భావించి పని చేసిన నాయకులకు అధినేత షాక్ ఇచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికే కాదు.. నామినేటెడ్ పోస్టులు కావాలన్నా సర్వేలో నిరూపించుకోవాల్సిందేనని మరోసారి తేల్చిచెప్పారు. అధినేత తీరుపై పార్టీ కేడర్‌లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పోటీపడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ, లోకసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో అవలంభించిన ఐవీఆర్‌ఎస్ సర్వేను నామినేటెడ్ పదవుల కేటాయింపులోనూ అనుసరించాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భావించినట్లు తెలుస్తోంది. దీంతో పదవుల కోసం నెల రోజులుగా ఎమ్మెల్యేలు, మంత్రులతో టచ్‌లో ఉన్న నాయకుల ఆశలన్నీ నీరుగారిపోయాయి. తిరుమల–తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌తో పాటు శ్రీకాళహస్తి దేవస్థానం, తుడా చైర్మన్‌తో పాటు వివిధ కార్పొరేషన్ అధ్యక్ష, సభ్యుల కోసం ఎవరికి వారు పోటీపడుతున్న విషయం తెలిసిందే. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనబెట్టిన అధిష్టానం సర్వే నివేదిక సమాచారం చూపించి తప్పించుకునేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. అందులో భాగంగా ఐవీఆర్‌ఎస్ సర్వే పేరుతో ఆలస్యం చేయడంతో పాటు.. తమకు అనుకూలమైన వారికి పదవులు కట్టబెట్టి, రాని వారికి సర్వేలో అనుకూలంగా రాలేదని చెప్పి, తప్పించుకునేందుకు ఎత్తుగడ వేసింది! పార్టీ అధిష్టానం ఐవీఆర్‌ఎస్ సర్వే పేరుతో విషమ పరీక్ష పెట్టడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. పార్టీ బలోపేతం కోసం ఇన్నాళ్లూ కష్టపడి, తీరా అధికారంలోకి వచ్చాక తమకే నామినేటెడ్ పదవులు దక్కుతాయన్న గ్యారెంటీ లేకపోవడంతో పార్టీ క్యాడర్‌కు నిద్ర కరువవుతోంది.

కేడర్ అంటే చులకనా?

తిరుమల–తిరుపతి దేవస్థానం, శ్రీకాళహస్తీశ్వరస్వామి, కాణిపాకం ఆలయ పాలక మండలి అధ్యక్ష పదవులతో పాటు సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయి నామినేటెడ్ పదవులతో పాటు కార్పొరేషన్ చైర్మన్ వంటి పదవులపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆశలు పెట్టుకున్నారు. పదవులు తమకే వరిస్తాయని ఇప్పటికే తన అనుయులతో గొప్పలు చెప్పుకున్నారు. ఇక పదవి వరించడమే తరువాయి అన్నట్లు నెలరోజులుగా నాయకులు, కార్యకర్తలు ఊహల్లో విహరించారు. తమకు పదవుల విషయంలో ఎలాంటి బ్రేకులు పడకుండా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నాయకులతో సన్నిహితంగా మసలుతూ వారి తల్లో నాలుకగా విధేయతను ప్రదర్శిస్తున్నారు. అయితే 'తామొకటి తలచిన బాబొకటి తలచెన్' అని లెవెల్లో పార్టీ అధిష్టానం వారందరికీ ఝలక్ ఇచ్చింది. గతంలోలా ఈసారి కూడా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికే పదవులు వస్తాయనే వారి కలలను కల్లలు చేసింది. ఎమ్మెల్యే అనుగ్రహం ఒక్కటే ఉంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు, ప్రజల అనుగ్రహం కూడా ఉండాలనే సాకు చూపించి, ఐవీఆర్‌ఎస్ సర్వేనే ప్రధాన ఆయుధంగా వారిపై ప్రయోగించేందుకు సిద్ధమైంది.

నేను మీ చంద్రబాబు నాయుడు...

''నేను మీ చంద్రబాబునాయుడు..మీ ప్రాంతంలో పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన రీతిలో గుర్తింపునివ్వాల్సిన అవసరం ఉంది..మీకో ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో లింక్‌ను ఓపెన్ చేయండి.. మీప్రాంతంలో ఎవరైతే బాగా కష్టపడ్డారో వారి గురించి తెలియజేయండి..వారిని తగిన విధంగా గౌరవిస్తాం'' అని ఇటీవల ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు గొంతుకతో రికార్డెడ్ వాయిస్ కాల్స్ వచ్చాయి. దీంతో ఆ పార్టీ నాయకులు ఖంగుతిన్నారు. గుర్తింపు అనేది ఏ రూపంలో ఇస్తారో తెలియక జుత్తు పీక్కుంటున్నారు.! అలా ఎస్ఎంఎస్‌లో లింకులు వచ్చిన పక్షంలో తమ పేర్లు అందులో ప్రస్తావించాలని కొందరు నాయకులు ప్రజలు, కార్యకర్తలను ప్రాధేయపడుతున్నట్టు తెలియవచ్చింది. మరికొందరు దీనిని కూడా తమకు అవకాశంగా మలచుకునేందుకు గట్టిగా యత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

అన్ని దశలూ దాటాల్సిందే!

నామినేటెడ్ పదవుల భర్తీకి టీడీపీ అధిష్టానం అన్ని అంశాలకు పరిగణనలోకి తీసుకుని పరీక్షించనుంది. ఐదు దశల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు, స్క్రీనింగ్ కమిటీల ద్వారా ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఆశావహుల జాబితాను 100మంది లోపు ఉండేలా సిద్ధం చేయించి ఆ పేర్లతో కూడిన జాబితాను అధిష్టానానికి పంపాలి. వారి సామర్థ్యం, విధేయత, నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని ఏ పదవికి ఎవరెవరు సమర్థులో నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను వేర్వేరు జాబితాలను సిద్ధం చేసి అందులో ఉన్న వారి పేర్లను నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఫోన్లు చేసి ఐవీఆర్‌ఎస్ సర్వే చేయించి పదవులను ఎంపిక చేసేందుకు అధిష్టానం వేగంగా అడుగులు వేస్తుండడంతో ఆశావహుల్లో అంతర్మథనం మొదలైంది.

అవసరం తీరిందనుకుంటున్నారా?

ఎన్నికల సమయంలో పార్టీ అధికారంలోకి వస్తే ఆ చైర్మన్ పదవి నీకే..నీకే అని హామీలతో ఊదరగొట్టిన అధి నాయకులు.. అధికారంలోకి వచ్చాక సర్వే పేరుతో పదవులు కట్టబెట్టాలని చూస్తుండటంపై నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పార్టీ కోసం కష్టపడిన తమకు అధికారం వచ్చాక పదవులను కట్టబెట్టేందుకు ఎక్కడలేని విచిత్రమైన విధానాలను అవలంభిస్తున్నారని కుతకుతమని ఉడికిపోతున్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీలకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల్లో శక్తివంచన లేకుండా శ్రమించామని ఎవరికి వారు అధిష్టానానికి వివరించారు. తమ శ్రమకు తగిన ఫలితం కోసం ఎదురు చూస్తున్నామని సమాచారం ఇచ్చారు. ఆశావహుల జాబితా పెద్దదిగా ఉందని చెప్పి, వారికి ఇష్టమొచ్చిన వారికి కట్టబెట్టి, చేతులు దులుపుకునేందుకు సర్వేకు పూనుకున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చర్చించుకుంటున్నారు. సర్వే పేరుతో ఎవరికి పదవులు వరిస్తాయో.. ఎవరికి మొండిచెయ్యి చూపుతారోననే గుబులు నాయకులు, కార్యకర్తలకు నిద్రలేకుండా చేస్తుండటం కొసమెరుపు.

ఎస్వీయూలో మూడు ముక్కలాట

- వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ పదవులకు పోటాపోటీ
- కూటమిలోని మూడు ప్రధాన పార్టీల అనుచరుల ఒత్తిళ్లు
- రాజకీయ చదరంగంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు
- వీసీ, రిజిస్ట్రార్ నియామకాలపై ఎటూ తేల్చని ప్రభుత్వం



ఎస్వీయూ ప్రధాన ద్వారం ముఖచిత్రం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పదవుల కోసం మూడు ముక్కలాటథ ప్రారంభమైంది. కూటమిలోని తెలుగు దేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ అభిమానులుగా ముద్ర పడిన సీనియర్ ప్రొఫెసర్లు, విశ్రాంత ప్రొఫెసర్లు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నెలరోజులుగా మందీ మార్బలంతో పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మూడు పార్టీల నుంచి వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ పదవులకోసం తీవ్ర ఒత్తిడి రావడంతో ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడినట్లు సమాచారం. తాము ఆశిస్తున్న పదవులకు రాష్ట్ర స్థాయి నాయకులతోనే కాకుండా విదేశాలలో స్థిరపడిన ప్రముఖ ఎన్నారైలు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీల సీఈఓలతో సైతం ఒత్తిళ్లు తెస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే సామాజిక వర్గాల సమీకరణలతో సంబంధం లేకుండా ఒక్కో పోస్టును ఒక్కో పార్టీకి చెందిన వారికి కట్టబెట్టాలంటూ కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన ముఖ్యనేత ఒకరు విద్యాశాఖ మంత్రికి సిఫారసు చేసినట్టు సమాచారం.

వర్సిటీలో స్తంభించిన పాలన

రాజకీయ చదరంగంతో ఎస్వీయూలో నెల రోజులుగా పాలన పూర్తిగా స్తంభించిపోయింది. ఒక్క ఫైలు కూడా కదలడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఉన్నతాధికారులు రాజీనామా చేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు నరకం అనుభవిస్తున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక ఉద్యోగల పరిస్థితి వర్ణనాతీతం. పరిశోధక విద్యార్థుల విషయంలో యూనివర్సిటీ రీసెర్చ్ సెంటర్(యూఆర్‌సీ), పీహెచ్‌డీల వైవాలు, డెమోలు పూర్తిగా నిలిచిపోయాయి. వెంటనే ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్లను నియమించాల్సిన అవసరం ఉందని ఎస్వీయూ ఉద్యోగులు కోరుతున్నారు.

గత వీసీల రాజీనామాలకు పడని ఆమోదముద్ర

సజావుగా పాలన సాగుతున్న వర్సిటీలలో అధికార పార్టీనేతలు ఒక్కసారిగా అలజడి సృష్టించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండవ రోజు నుంచే రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు అస్త్రాలుగా నూతన ప్రభుత్వం ప్రయోగించి వీసీ, రిజిస్ట్రార్ల చేత రాజీనామాలు చేయించింది. రాజీనామాలకు ససేమిరా అన్న వర్సిటీలలో కూటమి అనుబంధ విభాగాల విద్యార్థి సంఘాలు, నాయకులు దాడులు చేసి, అధికారులను బెదిరించి, రాజీనామా చేయించారు. ఈ పరిణామాలకు దాదాపు రాష్ట్రంలోని అన్ని వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు తమ రాజీనామాలను ఉన్నత విద్యామండలికి సమర్పించి గవర్నర్ ఆమోదానికి పంపారు. కానీ నెల రోజులు కావస్తున్న ఇంతవరకూ రాజీనామాలకు ఆమోదముద్ర పడలేదు. ఇందుకు మూడు ముక్కలాటే కారణమని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఒత్తిడి తగ్గే వరకు వీసీల రాజీనామాలకు ఆమోదముద్ర పడనీయకుండా కావాలని ప్రభుత్వం ఆడుతున్న నాటకంగా విద్యావేత్తలు భావిస్తున్నారు. అంతే కాకుండా గతంలో ఏ ప్రభుత్వమూ ఉన్నత విద్యావ్యవస్థలకు ఇలా రాజకీయ మకిలి అంటించిన దాఖలాలు లేవని విద్యావేత్తల్లో ఆందోళన సైతం వ్యక్తమైంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

- ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ

తిరుపతి(అలిపిరి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని.. ఇందుకు ప్రతి ఒక్కరూ ఓ మొక్కను పెంచి సంరక్షిస్తే అదే చెట్టై మనల్ని కాపాడుతుందని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ అన్నారు. ఆదివారం స్థానిక ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు 'ఒక మొక్క నాటండి.. ఆ మొక్క ప్రాణాలను కాపాడుతుంది' అనే అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (రైల్వే) మధుసూదన్ మాట్లాడుతూ మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని.. విద్యార్థులు బాల్యం నుంచే మొక్కలను పెంచడం అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు గ్రీన్ వే లైఫ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తుడా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటనారాయణ, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, తిరుపతి, నగరి, సదుం ప్రాంతాల్లోని విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

● సంతోష 'తీరం'



తూపిలిపాలెం తీరంలో స్నానాలు చేస్తూ సరదా చేస్తున్న పర్యాటకులు

ఆదివారం సెలవు దినం కావడంతో మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఒక్కోసారి ఉగ్ర రూపం దాల్చే సముద్రపు కెరటాలు ప్రస్తుతం సన్నని తుంపర్ల వర్షం పడుతున్నప్పటికీ అలల తీవ్రత తక్కువగా ఉండటం విశేషం. దీంతో బీచ్‌కు వచ్చిన పర్యాటకులకు స్నానాలు చేసేందుకు అనువుగా ఉండడంతో యువకులు, మహిళలు తీరంలో కేరింతలు కొడుతూ సందడి చేశారు.

– వాకాడు

వేడుకగా బకాసుర వధ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మూడో రోజు ఆదివారం హిడింబ, బకాసుర వధ ఘట్టం వేడుకగా జరిగింది. ఇందులోభాగంగా ఆదివారం ఉదయం భీముని వేషధారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో భిక్షాటన చేశారు. అనంతరం హిడింబ, బకాసుర వధ కార్యక్రమం జరిగింది. ఈ ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



భిక్షాటనలో భీమ వేషధారి

చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం



బురదగుంతలతో అన్నాసామిపల్లె రోడ్డు

రేణిగుంట: మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు బురద మయమై గుంతలను తలపిస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. మండలంలోని అన్నాసామిపల్లె–వెంకటాపురం రోడ్డు, రేణిగుంట నుంచి తహసీల్దార్ కార్యాలయం, బీసీ హాస్టల్‌కు వెళ్లే మార్గం, కరకంబాడి పంచాయతీ తారక రామానగర్, విప్పమానుపట్టెడ, గుత్తివారిపల్లె గ్రామాల్లో వీధులు వర్షపు నీరు నిలిచి బురదగుంతలుగా మారాయి. దీంతో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు జారిపడుతున్నారు. ప్రభుత్వం సీసీ రోడ్లను వేయాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా రేణిగుంట బీసీ హాస్టల్ రోడ్డు

క్లుప్తంగా

హర్షవర్ధన్ రాజుకు వీడ్కోలు


ఎస్పీని సన్మానిస్తున్న ఏఎస్పీలు, డీఎస్పీలు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు బదిలీపై కడపకు వెళ్తున్న సందర్భంగా తిరుపతి జిల్లా పోలీసు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి పోలీసు అతిథి గృహం వద్ద జిల్లా అధికారులు పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉంటే రెండు నెలల కాలంలో హర్షవర్ధన్ రాజు విధులలో సమర్థవంతంగా నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. వీడ్కోలు పలికిన వారిలో తిరుపతి జిల్లా ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు ఉన్నారు.

నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్ సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. తొలుత తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారని పోలీసులు తెలిపారు

'గురుకుల' విద్యార్థిని మృతిపై రాస్తారోకో


ఆందోళనకారులతో చర్చిస్తున్న జిల్లా అధికారులు


గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న అధికారులు

- జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు
- వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు పరీక్షలు

డక్కిలి: డక్కిలి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి బాలిక అడసనపల్లి సరీనా మృతి ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలోని కమ్మపల్లె రోడ్డు సెంటర్‌లో ఎంఆర్‌పీయస్, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. గురుకుల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలిక మృతి చెందిందని ఆరోపించారు. గురుకుల సిబ్బంది చులకనగా వ్యవహరిస్తుంటారని, అత్యవసర సమయంలో వచ్చినా తమ పిల్లలను కలిసేందుకు అనుమతించరని పలువురు తల్లిదండ్రులు మండిపడ్డారు. బాలిక మృతి ఘటనపై మూడు రోజుల నుంచి ఆందోళన చేస్తు న్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. జిల్లా ఉన్నతాధికారులు వచ్చి న్యాయం చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని, మృతికి కారణమైన గురుకుల సిబ్బందిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నినదించారు.

ఆందోళనకారులతో చర్చించిన అధికారులు

ఇది తెలుసుకున్న వెంకటగిరి సీఐ సంఘమేశ్వరరావు, గురుకుల పాఠశాల, కళాశాలల తిరుపతి జిల్లా సమన్వయకర్త పద్మజ, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి, ఎంపీడీఓ లీలామాధవి తదితరులు సైతం అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించారు. అన్ని కోణాల్లో విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. అదే సమయంలో ఆ మార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, కొండేపాటి గంగాప్రసాద్ ఆందోళనకారుల వద్దకు వెళ్లి సమస్యపై ఆరా తీశారు. అక్కడి నుంచే గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. దీంతో ఆందోళనకు తెరపడింది. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంగళపూరి సురేష్, ఏపీ ప్రజా సంఘాల నాయకులు గద్దల మునెయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు రవి, మణి, వాసుదేవర్, రాజేంద్ర, అంబేడ్కర్, అంకయ్య,ప్రేమ్, పలు ప్రజా సంఘాల నాయకులు జే.వెంకటేశ్వర్లు, మధు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు

గురుకులం విద్యార్థిని సరీనా మృతికి సంబంధించి చెన్నైలోని ఎగ్మూర్ చిన్న పిల్లలు ఆసుపత్రి వైద్యులు ఇచ్చే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా గురుకులం సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి తెలిపారు. గురుకుల పాఠశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గురుకులంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులను వైద్య పరీక్షలు చేశామన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారి బాగోగులపై శ్రద్ధ వహించాలని గురుకులం సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు. డీపీఓ సుశీలదేవీ మాట్లాడుతూ, గురుకులంలోని విద్యార్థినుల సౌకర్యార్థం రెండు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బ్లీచింగ్ చల్లాలని స్థానిక పంచాయతీ అధికారులను ఆదేశించమన్నారు. అలాగే అధికారులు గురుకులంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సమస్యలపై బాలికలను ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, ఎంఈఓ–2 జగదీష్, ఈఓపీఆర్డీ అల్లాబక్షు, ఆర్‌ఐ రాజేష్, వీఆర్వో నాగేంద్ర, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలి



కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

- వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలి
- అమ్మాయిల మిస్సింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ, ఐద్వా నేతల డిమాండ్ చేశారు.

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో గత రెండు వారాల నుంచి వరుసగా చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోవడం సిగ్గుచేటని, వీటిని అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా, వారికి రక్షణ కల్పించాలని, వాసంతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎంఆర్ పల్లె సర్కిల్ దండి మార్చ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో చిన్నారి వాసంతి కేసులో ఇప్పటికీ మృతదేహం లభించకపోవడం, మిస్సింగ్ కేసు ఛేదించడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని విమర్శించారు. ఏర్పేడులో చిన్నారిపై జరిగిన సంఘటన దుర్మార్గమన్నారు. పాఠశాల స్థాయిలోనే మహిళలను గౌరవించే విధంగా చూడాలన్నారు. తద్వారా కొంతవరకు అత్యాచారాలు అరికట్టవచ్చన్నారు. ఇటీవల సమాజంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, శిక్షలు మాత్రం నామమాత్రంగా విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతే తమ పార్టీ ముఖ్య ఉద్దేశమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా అత్యాచారాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, తేజ, భార్గవ్, నరేంద్ర, శ్రీనివాస్, గణేష్, హర్షద్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు


బాధితురాలు శకుంతలమ్మ

నాగలాపురం: చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఓ వృద్ధురాలి మెడలో నుంచి లాఘవంగా బంగారు గొలుసు లాక్కెళ్లి ఉడాయించారు. ఈ ఘటన పిచ్చాటూరు మండలంలోని అప్పలరాజు కండ్రిగలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..మండలంలోని అప్పలరాజు కండ్రిగకు చెందిన శకుంతలమ్మ(62) సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇద్దరు ఆగంతకులు స్కూటీ మీద వచ్చి ఆమె మెడలో ఉన్న 36 గ్రాముల (2,32,000 రూపాయల విలువ) బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఆమెకు ఎవరూ లేకపోవడంతో దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

టెంపో ట్రావెలర్, కారుపై కూలిన భారీ వృక్షం

- తప్పిన పెను ప్రమాదం
- భక్తులు సురక్షితం



టెంపోపై పడిన భారీ వృక్షం

తిరుమల : తిరుమలలోని శ్రీవరాహస్వామి అతిథి గృహం ఎదురుగా ఉన్న బాటగంగమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలోని వాహన పార్కింగ్ వద్ద భారీవృక్షం వాహనాలపై కూలింది. ఐదు రోజుల క్రితం జపాలి క్షేత్రంలో ఓ మహిళపై చెట్టుకొమ్మ విరిగిపడి తీవ్రంగా గాయపడిన సంఘటన మరువకముందే.. వృక్షం రెండు టెంపో ట్రావెలర్లు, కారుపై పడడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అదే సమయంలో భక్తులు ఆ వాహనాల్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొంత సమయానికి టీటీడీ అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆ చెట్టును తొలగించారు. చెట్టును ఆలస్యంగా తొలగించడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని తిరుమల పోలీసులు పరిశీలించారు.

ఆగని ఏనుగుల దాడులు

పెద్దపంజాణి: మండలవ్యాప్తంగా అటవీ సరిహద్దులో ఉన్న గ్రామాల్లో గత కొంతకాలంగా ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అడవికి సరిహద్దులో ఉన్న ఆకులవారిపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె గ్రామాలకు చెందిన రైతులు పొలాల్లో సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి పలమనేరు రేంజ్ కీళపట్ల ఫారెస్టు నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లికు చెందిన రైతు రమణారెడ్డి మామిడి తోటపై విరుచుకుపడ్డాయి. అదేవిధంగా పెనుగొలకల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరీనగర్ ఫీడర్‌లోని కరెంట్ స్తంభాన్ని నేలకూల్చాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు విద్యుత్తు స్తంభం దారికి అడ్డంగా పడి ఉన్న విషయాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న వారు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ఏనుగులను కట్టడి చేయాలని రైతులు కోరారు.

భర్త కోసం ఎదురు చూస్తుంటే..!

- లారీ ఢీకొని తల్లి సహా కుమార్తె మృతి
- మరో ఇద్దరికి గాయాలు


తల్లీ కుమార్తెల మృతదేహాలు

ఏర్పేడు: భర్త రాకకోసం పిల్లలతో రోడ్డు పక్కన నిరీక్షిస్తున్న మహిళపైకి ఓ లారీ మృత్యుశకటమై దూసుకు పోయింది. ఈ దుర్ఘటనలో తల్లితో సహా చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని పరమాలపల్లె వద్ద ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది.తొట్టంబేడు మండలంలో విషాదాన్ని నింపింది. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం.. తొట్టంబేడు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన విజయమ్మ కుమార్తె బాపన శారద(22), శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శివ దంపతులకు కుమారుడు గురుకార్తీక్(4), కుమార్తె గురువైష్ణవి(2) ఉన్నారు. శారద తమ పుట్టింటికి వెళ్లి అక్కడ నుంచి తన తల్లి విజయమ్మతోపాటు తన ఇద్దరి పిల్లలతో కలిసి బస్సులో ఆదివారం రాత్రి మండలంలోని పరమాలపల్లె వద్దకు చేరుకుంది. అక్కడ ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న చెట్టు వద్దకు ద్విచక్ర వాహనాన్ని తీసుకుని రావాలని భర్తకు ఫోన్ చేసింది. తల్లి, ఇద్దరు పిల్లలతో చెట్టు వద్ద ఉన్న బండపై కూర్చుని ఉండగా వెంకటగిరి నుంచి ఏర్పేడుకు వెళుతున్న టర్బో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శారద, చిన్నారి గురువైష్ణవి అక్కడికక్కడే మృతిచెందారు. విజయమ్మ, గురుకార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లీ, చిన్నారి మృతిచెందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికుల రోదనలు మిన్నంటాయి.


ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ

సిరులు కురిపిస్తున్న నిమ్మ

- ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం
- దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎగుమతులు
- వెంకటగిరి నియోజకవర్గంలో ఏటా పెరుగుతున్న నిమ్మతోటల సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు


నిమ్మ కాయలు గ్రేడింగ్ చేస్తున్న మహిళలు


నిమ్మ చెట్లు మొదట్లో ఉన్న పిచికారి చెట్లును తొలగిస్తున్న మహిళ రైతులు

సైదాపురం: నిమ్మ సాగు రైతుకు సిరులు కురిపిస్తోంది. గడిచిన ఐదేళ్లగా భూగర్భజలాలు పెరగడం.. గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతు మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది. మార్కెట్‌లో ఏడాది పొడవునా గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఆశించిన ఆదాయం లభిస్తోంది. ప్రధానంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 26,176 ఎకరాల్లో 10,106 మంది రైతులు నిమ్మతోటలు సాగుచేస్తున్నారు. అందులో పొదలకూరులో 7 వేలు, కలిగిరిలో 2,155, కలువాయిలో 2,095, చేజర్లలో 2,264, రాపూరులో 2,983 ఎకరాల చొప్పున నిమ్మ సాగులో ఉంది. వెంకటగిరి నియోజకవర్గంలో అంతర్భాగమైన సైదాపురం మండలంలోనే సుమారు ఏడు వేల ఎకరాల్లో ప్రస్తుతం నిమ్మ సాగుచేస్తున్నారు. మరో వెయ్యి ఎకరాల్లో నిమ్మ తోటలను సాగుచేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

సైదాపురం విస్తృతంగా నిమ్మసాగు

సైదాపురం మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు ఏడువేల ఎకరాల్లో నిమ్మతోటలు సాగుచేస్తున్నారు. కొద్ది మంది మినహా అందరూ నిమ్మతోటలను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది కూడా మరో వెయ్యి ఎకరాల్లో నిమ్మతోటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో అధిక శాతం జనాభాలో ప్రతి రైతూ 50 నుంచి 5 వేల నిమ్మచెట్లు సాగుచేస్తుంటారు. దాదాపు 70 శాతం భూముల్లో నిమ్మ చెట్లే కన్పిస్తుంటాయి. ఎకరా విస్తీర్ణంలో 100 నిమ్మచెట్లు వేస్తారు. మూడేళ్ల తర్వాత కాపుకొచ్చే సమయానికి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మూడేళ్ల తర్వాత మార్కెట్‌ను బట్టి రైతుకు మొదటి ఏడాదే పెట్టిన పెట్టుబడి చేతికొస్తుంది. మండలంలో జనాభా 48 వేల మంది ఉండగా.. నిమ్మచెట్లు 7 లక్షల వరకు ఉన్నాయి. అధికంగా బోర్లమీద ఆధారపడి నిమ్మతోటలు సాగుచేస్తుంటారు. మండలంలో తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్–2 నుంచి గంగ నీరు పుష్కలంగా అందుతోంది. మూడేళ్ల నుంచి నిమ్మ కాయలకు మంచి గిరాకీ వస్తుండడంతో రైతులు మళ్లీ నిమ్మసాగుపై దృష్టి పెట్టారు.

ఆశాజనకంగా నిమ్మ ధరలు

ఈ ఏడాది సీజన్, అన్ సీజన్ అన్న తేడా లేకుండా మంచి ధర పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు ఖర్చులు పోను రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు నికర ఆదాయం పొందుతున్నారు. గతంలో ఎకరాకు ఏడాదికి రూ.30 వేల నుంచి రూ.80 వేలు వస్తే చాలనుకునేవారు. ఈ ఏడాది మూడు ధర ఆశాజనకంగా ఉండడంతో మంచి ఆదాయం పొందుతున్నారు. సాధారణంగా జూన్, జూలైలో నిమ్మకు అన్‌సీజన్. మార్కెట్లో బస్తా కాయలు (50 కేజీ) రూ.200 నుంచి రూ.400 మేర పలికేవి. అలాంటిది ప్రస్తుతం రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఉంటోంది. వంద కేజీల బస్తా ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పలుకుతోంది. ఇదే గత ఏడాది అన్ సీజన్‌లో వంద కిలోల బస్తా రూ.18వేల నుంచి రూ.22 వేలు పలికింది. మొత్తానికి ఈ పర్యాయం కూడా అధిక ధర రావడం విశేషం.

విదేశాలకు ఎగుమతి

నిమ్మకాయలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరిగింది. ఈ ప్రాంతంలో కాసే నిమ్మకాయలను బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ మార్కెట్‌లకు తరలించి అటు నుంచి విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. సైదాపురం ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యంగా ఉంటాయి. దీంతో గూడూరు నిమ్మకాయల మార్కెట్లో సైదాపురం మండలం నుంచి వచ్చే నిమ్మకాయలకు అధిక ధర ఇస్తుంటారు.

రూ.15 లక్షల ఆదాయం



ఎనిమిదేళ్ల క్రితం పదెకరాల్లో వెయ్యి నిమ్మ చెట్లు నాటా. గతంలోఅప్పులు చేసి మరీ బోర్లు వేశా. అయినా పెట్టుబడి కూడా రాలేదు. గిట్టుబాటు ధర లేక పోవడతో గతంలో చెట్లుకే కాయలను వదిలేశాం. ఇప్పుడు భూగర్భ జలాలు పెరగడంతో సాగు నీటికి కొరతలేకుండా ఉంది. ఏడాది పొడవునా మార్కెట్లో నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఒకానొక దశలో గూడూరు నిమ్మకాయల మార్కెట్లో బస్తా రూ.22 వేలు పలికింది. నా జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ధర చూడలేదు. అన్ని ఖర్చులు పోను సుమారు రూ.15 లక్షలు చేతికొచ్చింది.

– యల్లంరాజు వరప్రసాద్‌రాజు, లింగసముద్రం, సైదాపురం మండలం

ఆశాజనకంగా నిమ్మధరలు



నేను ఐదు ఎకరాల్లో పదేళ్లుగా నిమ్మ సాగు చేస్తున్నా. ఏడాది పొడవునా ఆశాజనకంగా నిమ్మధరలు ఉన్నాయి. గతంలో గిట్టుబాటు ధరలేక ఒకటి రెండు సార్లు కాయలు కోయకుండానే చెట్లపైనే వదిలేశాం. ఈ సారి ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాది ఐదు ఎకరాల్లో సుమారు రూ.7 లక్షల దాకా ఆదాయం వచ్చింది.

– మందపాటి ఆదిశేషయ్యనాయుడు

సాగు విస్తీర్ణం పెరిగింది



గతంలో ఎన్నడూలేని విధంగా ఏడాది పొడవునా నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత మూడేళ్ల నుంచి నిమ్మ తోటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. రైతులకు విరివిగా వివిధ పథకాల ద్వారా రాయితీలను ప్రభుత్వం ఇస్తోంది.

– ఆనంద్, ఉద్యానశాఖ అధికారి